# జీవన సాఫల్యం

శ్రీరాంపురం గ్రామ విద్యార్థి గోవిందుకు ఇంటర్మీడియల్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో పదోర్యాంక్. అతని తండ్రి రంగురాళ్ళ క్వారీలో వాచ్‌మేన్, పేరు గురుమూర్తి. ఆ రోజు దినపత్రికలో ఆ వార్త చదివి ఆనందం పట్టలేక పోయాను.

నా ఆనందానికి కారణం గురుమూర్తి. అతను ఒకటో తరగతి నుంచి నా క్లాస్‌మేట్. అందుకే నేను అతడిని అభినందించాలనుకున్నాను. రెండు రోజులయ్యింది శ్రీరాంపురం వచ్చి. ఇది నా స్వస్థలం. పుట్టింది, పెరిగింది ఇక్కడే.... బాల్యమిత్రుడు గురుమూర్తిని కలవాలి. వెంటనే బయలుదేరాను. మా తమ్ముడికొడుకు వాసును బండి తియ్యమన్నాను. వాడు నిముషంలో బండి రోడ్డుమీద ఉంచాడు. చాలాకాలం తర్వాత గురుమూర్తిని కలవ బోతున్నాను. ఏదో ఉద్వేగం. మనసు గతంలోకి వెళ్ళిపోయింది.

గురుమూర్తిని మొదటిసారి చూసినప్పుడు వాడి వయస్సు ఆరేళ్ళు. అంటే దాదాపు యాభయ్యేళ్ళ క్రితం. నాతోపాటు వాడూ ఒకటో తరగతిలో చేరడానికి మా ఊరు దుంపలబడికి వాళ్ళమ్మతో పాటు వచ్చాడు. అందరం క్లాసులో కూర్చున్నా వాడు వాళ్లమ్మ చంక దిగలేదు. వాడు చాలా బొద్దుగా, ముద్దుగా ఉండేవాడు. సన్నగా వున్న వాడి తల్లి వాడిని భారంగా మోస్తూ వచ్చేది. వాడిని దింపి, క్లాసులో కూర్చోబెడదామనే ఆమె ప్రయత్నం ఫలించేది కాదు. అందుకే ఆమె, వాడితోపాటు స్కూల్లో ఉండిపోయేది.

రోజూ అదే తంతు. దాదాపు నెలరోజులు అలాగే గడిచాయి. ఆ తర్వాత మెల్లగా గురుమూర్తి స్కూలుకు అలవాటు పడ్డాడు. మేమందరం క్రింద నేలమీద కూర్చుంటే వాళ్లమ్మ వాడికోసం ఒక చెక్కపీట తీసుకొచ్చేది. వాడి మెడలో పులిగోరుతో చేసిన బంగారు గొలుసు, కాళ్ళకు బూట్లు వేసేది. ఒక

కేరేజీ నిండా తినుబండారాలు తెచ్చేది. వాడి, సంచిలో పలకా, పుస్తకం రంగురంగుల బలపాలు వుండేవి. అయినా వాటిని ఎప్పుడూ తీసేవాడు కాదు. స్కూలుకు వచ్చింది లగాయితు ఆ కేరేజిలోని మిఠాయిలు తింటూ కాలం గడిపేవాడు.

ఆఖరిగంట వినబడగానే గబగబా పరుగెత్తి తనకోసం వచ్చిన గూడు బండి ఒక్క ఉదుటన ఎక్కేవాడు. ఆ బండిని చూడడానికి అందరం ఎగబడేవాళ్ళం. ఆ బండిని లాగే ఎద్దు మెడలో రంగు రంగుల మువ్వలు. బండి చుట్టూ లేసు పరదాలు. లోపలి బండిలో మెత్తటి పరుపు, తలగడ. ఆ వయసులో మాకందరికీ గురుమూర్తి హీరోలా కనిపించడానికి మరో కారణం, ఆరేళ్ళ వయసులోనే చేతికి గడియారం వేసుకుని వచ్చేవాడు. అయితే ఆ గడియారం పనిచేసేది కాదు. వాడిని సరదాగా టైమెంతయింది అనేవారం అంతా.... వాడు నోటికొచ్చిన టైము చెప్పేవాడు. అందుకే అందరూ వాడిని 'ఆగిపోయిన గడియారం' అని పిలిచేవారు.

వాడు లేకలేక పుట్టడంతో తల్లిదండ్రులు వాడిని అలా అతిగారాబంగా పెంచేవారు. వాడు నిరంతరం స్కూల్లో గోళీకాయలాడడం, ఇంటిదగ్గర చెట్లెక్కి జామకాయలు కొయ్యడం చేసేవాడు. అలా వాడి చదువూ, చెట్టెక్కింది. పరీక్షల్లో ఫెయిలైనవాడిని వాళ్ళమ్మ, నాన్న పట్టించుకొనేవారు కాదు. అయినా అటెండెన్సుతో ప్యాసయ్యే పరిస్థితి ఉన్న రోజుల్లో చదవకపోయినా పదో తరగతి వరకూ నెట్టుకొచ్చాడు.

అయితే, అప్పటికే వాడి కుటుంబ పరిస్థితి దిగజారిపోయింది. వాళ్ళ నాన్న చేసే ప్రత్తి వ్యాపారంలో చాలా నష్టం వచ్చింది. అలా జమిందారుల్లా బతికే అతడి కుటుంబం రోడ్డున పడింది. అతని తల్లి, తండ్రి పొలం కౌలుకు తీసుకుని వ్యవసాయం మొదలెట్టారు. అతడి కుటుంబ పరిస్థితి బాగోలేక పోయినా గురుమూర్తి పరిస్థితి ఏమీ మారలేదు. అల్లరి చిల్లరగా ఆడుతూ పాడుతూ గడిపేవాడు. ఫలితంగా టెంత్‌క్లాస్ ఫెయిలయ్యాడు.

తల్లితండ్రులు అతడిని వ్యవసాయంలో పెట్టారు. అక్కడా అతనికి చుక్కెదురు. అతిగారాబంతో అలా తయారుచేసామని అతడి తల్లితండ్రులు బాధపడ్డారు. ఇక లాభం లేదని ఒక కిరణాషాపులో వ్యాపారం మెళకువలు నేర్చుకుంటాడని చేర్చితే అక్కడా అతడికి నికరం లేదు. పని ఎగ్గొట్టి సినిమా లకు చెక్కేసేవాడు.

చిన్నప్పుడు అతడికి పెట్టిన 'ఆగిపోయిన గడియారం' అనే పేరు స్థిరపడిపోయింది. గురుమూర్తితో, ఒకటో క్లాసులో చేరినవాళ్ళం, అందరం రకరాల ఉద్యోగాల్లో, వృత్తుల్లో స్థిరపడినా గురుమూర్తి ఎందుకూ పనికి రాకుండా పోయాడని బాధపడేవాళ్ళం. రాష్ట్రం అంతా ఉద్యోగరీత్యా తిరిగి మా ఊరికి దగ్గర్లోని టౌనుకు సంవత్సరం క్రితం బదిలీ అయ్యాను. గడిచిన కొన్ని సంవత్సరాలలో అప్పుడప్పుడు గురుమూర్తి గురించిన విశేషాలు ఆనోటా ఆనోటా వినేవాడిని.

రెండుమూడుసార్లు బస్టాండులోనో, రైల్వేస్టేషన్‌లోనో చూసినప్పుడు చిన్నగా నవ్వి ముక్తసరిగా మాట్లాడి వెళ్ళిపోయేవాడు. అతడి పరిస్థితి బాగో లేనందుకు, కొద్దిగా ఆత్మన్యూనతా భావనతో అతడు ఎక్కువగా మాట్లాడే వాడు కాదని నాకనిపించేది. ఇప్పుడు గురుమూర్తి కొడుకు ప్రయోజనకుడై నందుకు నాకు చాలా సంతోషం. ఇప్పుడైనా మనసు విప్పి మాట్లాడుతాడని బయల్దేరాను.

"పెద్ద నాన్నా! ఇదే రంగురాళ్ళ క్వారీ" అంటూ మా తమ్ముడి కొడుకు మాటలతో గురుమూర్తి గురించిన ఆలోచనలకు స్వస్తి చెప్పి ఆ ప్రాంతంవైపు దృష్టి సారించాను. చుట్టూ కొండలు. కొండల దిగువన చిన్న చిన్న గుడారాలు, భూమినుంచి మూడు వందల యాభై అడుగుల ఎత్తులో కొండపై రంగురాళ్ళ తవ్వకం జరుగుతోంది. ఆ ప్రదేశమంతా ప్రొక్లైనర్లతో కనిపించింది. క్వారీ గేటు దగ్గర వున్న ఒక వ్యక్తిని అడిగాను గురుమూర్తి గురించి.

అతడు ముందుకు వెళితే కొండదిగువన షెడ్డులో వుంటాడని చెప్పడంతో నా తమ్ముడి కొడుకును అక్కడే వుండమని ముందుకు కదిలాను. రెండడుగుల వేసి, వరసగా షెడ్లు వేసిన ఆ ప్రదేశం దగ్గర నిల్చుని గురుమూర్తి అని గట్టిగా పిల్చాను. ఖాకీ ఫేంటు, షర్టుతో ఒక వ్యక్తి షెడ్డులోంచి బయటకు వచ్చాడు. అతడిని చూసి ఆశ్చర్య పోయాను. మూడేళ్ళక్రితం గురుమూర్తికి, ఇప్పటి గురుమూర్తికి పోలికే లేదు. శరీరం బాగా నల్లబడింది. యాభై ఆరేళ్ళకే బాగా వంగిపోయినట్లు కనిపించాడు. నన్ను చూసిన అతడి కళ్ళల్లో తడి. ‘‘ఈ బాల్యమిత్రుడిని గుర్తుపెట్టుకుని వచ్చావా సంతోషం...’’ అన్నాడు నా రెండు చేతులు పట్టుకుని,

‘‘ఎందుకు, ఈ రిస్కుతో కూడిన పనికి ఒప్పుకున్నావు. ఈ మధ్య కాలంలో రంగురాళ్ళ క్వారీలలో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి కదా.... పైగా ఈ నిర్జనప్రదేశంలో వాచ్‌మేన్ ఉద్యోగం.....’’ అన్నాను.

గురుమూర్తి వెంటనే, ‘‘అలా కేంటీన్‌లోకి వెళ్ళి, చాయ్ తాగుతూ మాట్లాడుకుందాం....’’ అంటూ నా చేయి పట్టుకుని ముందుకు నడిచాడు. కొంచెం దూరంలో చెట్లక్రింద కేంటీన్ దగ్గరున్న చిన్న బెంచీమీద కూర్చున్నాం. ‘‘రెండు చాయ్’’ అంటూ అరిచి గురుమూర్తి చెప్పడం మొదలుపెట్టాడు.

‘‘పాపం.. నా సంగతి నా కొడుక్కి అర్థమయింది. ఈ తండ్రి వాడికి ఏ విధంగానూ సాయపడడని, వాడంతట వాడే బాగా చదువుకుని, టెన్త్ క్లాసులో మంచిమార్కులతో ప్యాసయ్యాడు. ‘నాన్నా ఐఐటి సీటు కోసం ప్రయత్నిస్తాను’ అన్నాడు. ఏ యోగ్యతా లేకుండా ఇలా మిగిలిపోయిన నేను నా కొడుకును ప్రయోజకుడిని చేద్దామనుకున్నాను. ఏ లక్ష్యం లేకుండా గాలివాటుగా పెరిగిన నేను, ఒక లక్ష్యంతో ముందుకు సాగుతున్న నా కొడుకును చూసి ఆనంద పడ్డాను. ‘‘ఐఐటి అంటే మాటలు కాదు. చాలా పుస్తకాలు కొనాలి. రెండేళ్ళులా వాడికి ఏం కావాలో అన్నీ చూడాలి. ‘‘అంతవరకూ పని, పాటూ

లేకుండా తిరిగిన నాకు, నా కొడుకు కోసం ఏదైనా చెయ్యాలనిపించింది తండ్రిగా కొంత ఆర్థిక సహాయం... అందుకే క్వారీ యజమాని సాంబయ్యగారిని పని ఇప్పించమన్నాను. ఏ చదువూలేని నాకు ఇక్కడ ఏ ఉద్యోగం దొరుకుతుంది? క్వారీలో వాచ్‌మేన్‌గా చేరాను. రెండేళ్ళయింది. నా కల నెరవేరబోతోంది. ఇప్పుడు, నా కొడుకు మంచి ర్యాంకులో ఇంటర్మీడియట్ ప్యాసయ్యాడు'' చెపుతున్న గురుమూర్తి ముఖంలో ఆనందం.

''మీ వాడు నీ కల నెరవేరుస్తాడు'' అంటూ గురుమూర్తి భుజం తట్టాను. అతడి చేయి స్పృశిస్తూ యధాలాపంగా అతని చేతి గడియారం వంక చూసాను. నాకు ఆశ్చర్యం వేసింది. అది ఒకటోక్లాసునుంచీ వాడి చేతికి వుండేదే. అదే ఆగిపోయిన గడియారం. వెంటనే సందేహ నివృత్తి కోసం అడిగాను, ''ఇది నీ చిన్నప్పటి గడియారం కదా!'' అని,

అతను నా మాటలకు నవ్వుతూ తన చేతి గడియారాన్ని చేతులతో తాకి - ''ఇది చిన్నపుడు మా అమ్మ నా చేతికి తొడిగిందే. ఎందుకో దీనిని తీయబుద్ధి కాలేదు. పెద్దవాడినయ్యే కొద్దీ ఆ గడియారానికి వుండే చైనులు మార్చేనుగానీ గడియారాన్ని అది ఆగిపోయిందయినా, మార్చలేకపోయాను, నా గుండె గడియారం ఆగిపోయేవరకు ఈ ఆగిపోయిన గడియారం నా చేతికి వుంటుంది'' అన్నాడు గురుమూర్తి.

''బావుంది... మీ తల్లిగారి జ్ఞాపకాలను చేతుల్తో కట్టేసుకున్నావన్నమాట...'' అన్నాను, అక్కడనించి లేచి అతనినుంచి సెలవు పుచ్చుకున్నాను. గురుమూర్తి నవ్వుతూ నాకు వీడ్కోలు చెప్పాడు.

* * *

సంవత్సరం తర్వాత మళ్ళీ మా ఊరు వెళ్ళాను మా తమ్ముడు కొత్తగా కట్టుకున్న ఇంటి గృహప్రవేశానికి వేసవి సెలవులు ఇవ్వడంతో వారం రోజులు

ముందుగానే మా కుటుంబంఅంతా మా ఊరు చేరుకున్నాం. నేను ఊరు చేరగానే మా తమ్ముడి కొడుకు వాసు, నా చెవిన ఒక వార్త చేరవేసాడు. నాకు మరోసారి ఆనందం కలిగించిన వార్త, గురుమూర్తి కొడుక్కి ఐఐటి సీటు రావడం... అతడి ఇంటికి వెళ్ళి అభినందించుదామనుకున్నాను గానీ, వాసుద్వారా గురుమూర్తికి గృహప్రవేశం ఫంక్షన్‌కు ఆహ్వానం పంపాను, ఆ రోజు కలవవచ్చును గదా అనుకున్నాను.

*　　　*　　　*

ఆ రోజే తమ్ముడి గృహప్రవేశం సత్యనారాయణ వ్రతం. పూజలో కూర్చున్నా నా కళ్ళు తలుపువైపు చూస్తున్నాయి. ఉదయం ఆరునుంచీ నా ఎదురుచూపు. గురుమూర్తి వస్తాడని వాసును అడిగాను ‘‘ఓరేయ్ సరిగా పిలిచావా! అడ్రస్సు అదీ చెప్పావా?’’ అని...

‘‘బాగానే చెప్పాను. అయినా ఈ ఊరివాడే, ఆయనకి మన ఇల్లు బాగా తెలుసు’’ అన్నాడు.

అయితే గంట అయింది.... రెండుగంటలయ్యింది గురుమూర్తి జాడలేదు. బహుశా ఏదో పనిలో ఉన్నాడేమో అనుకున్నాను. అప్పటికి ఉదయం ఎనిమిది అయింది. ఒకసారి గురుమూర్తికి ఫోన్ చేసే బాగుండును. ‘కనీసం భోజనానికైనా వస్తాడేమో.... మిత్రుడితో కలిసి భోజనం చెయ్యాలి...’ అనుకున్నాను. వాసు చేతిలో సెల్‌ఫోన్ చూశాను.

‘‘ఒరేయ్, గురుమూర్తి పనిచేస్తున్న ఆ క్వారీకి ఫోన్ చెయ్యి’’ అన్నాను.

‘‘అబ్బే ఎందుకూ ఆయనే వస్తాడు’’ అన్నాడు వాసు.

‘‘ఇవ్వరా నీ ఫోను, నేను చేస్తాను’’ అన్నాను.

వాడు గబగబా, ఫోన్ జేబులో పెట్టుకుని కంగారుగా బైటకు పరిగెత్తాడు.

‘‘ఏమయిందిరా?’’ అన్నాను వాడి వెనకే వెళ్ళాను వాడి ముఖం పాలిపోయి కన్పించింది.

‘‘పెద్దనాన్నా, క్షమించండి. ఇందాకే తెలిసింది. ఆ క్వారీలో పెద్ద ప్రమాదం జరిగిందట.... మీరు పూజలో ఉన్నారని చెప్పలేదు.’’

వాడి మాటలకు మనసు మొద్దుబారిపోయి నట్టయింది.

‘‘ఏమయిందసలు?’’ అడిగాను.

‘‘రాత్రి రంగురాళ్ళ క్వారీ పగలకొట్టి, అక్రమంగా ఎత్తుకుపోవడానికి ఎవరో బాంబు పెట్టారట. ఆ సమయంలో అటువైపు వెళుతున్న ఇంజినీరింగ్ కాలేజీ పిల్లల బస్సు వెళుతోంది, గస్తీ తిరుగుతున్న గురుమూర్తికి, బాంబు పెట్టిన విషయం తెలిసింది. బస్సు డ్రైవరును కొండల మధ్య నుండి బస్సు వెళ్ళనివ్వకుండా ఆపేసాడు. ఆ ప్రయత్నంలో ఆ బస్సులోని యాభైమంది పిల్లల్ని రక్షించిన గురుమూర్తి తన్ను తాను రక్షించుకోలేకపోయాడు. బాంబు పేలి, బాగా గాయాలయ్యాట...’’ అన్నాడు వాసు.

‘అయ్యో’ అంటూ నా మనసు బాధగా మూలిగింది.

‘‘ఏ ఆస్పత్రి?’’ అన్నాను.

‘‘మన ఇంటి దగ్గరలోనే.... వెళదాం పదండి’’ అంటూ స్కూటర్ తీసాడు.

నా మనసు మనసులోలేదు. పావుగంటలో ఆ ఆస్పత్రి గేటుముందు కొచ్చాం. ఐదు నిమిషాల్లో గురుమూర్తిని వుంచిన ఆసుపత్రి గదికి చేరు కున్నాము. గదిముందు గురుమూర్తి కొడుకు గోవిందు, అతడి భార్యా విషణ్ణవదనాలతో ఉన్నారు. గోవిందు రెండుచేతులు పట్టుకుని ‘‘కంగారు పడకు, మీ నాన్నకు ఏమీకాదు...’’ అన్నాడు. అప్పటికే గురుమూర్తికి తలకు ఆపరేషన్ పూర్తయింది. ఇంకా మెలకువ రాలేదట. బైట బెంచిమీద కూర్చున్నాను. గంటసేపు టైము ఎలా గడిచిందో తెలీదు.

డాక్టరు బైటకొచ్చాడు. "ఆయన ఇంకా మగతగా వున్నాడు, కళ్ళు తెరిచాడు, ఏమీ డిస్టర్బు చేయకుండా చూసిరండి" అన్నాడు.

ముందుగా గురుమూర్తి భార్య, కొడుకు లోపలికెళ్ళారు. నేను వెనకగా వెళ్ళాను. తలకు బేండేజి. శరీరం మీద అక్కడక్కడ చిన్న గాయాలు. కళ్ళు తెరిచి చూసిన గురుమూర్తి, నన్ను చూసి చిన్నగా నవ్వాడు. అతని ముఖం ప్రశాంతంగా కనిపించింది. గురుమూర్తిభార్య, కొడుకు బలవంతంగా ఏడుపు ఆపుకున్నారు. తన చేతి గడియారంవంక ఆ గదిలోని గోడగడియారం వంక చూడమంటూ సైగచేసాడు.

అతడి చేయి స్పృశిస్తూ ఆ ఆగిపోయిన గడియారం వంక చూసాను. అది తొమ్మిది గంటల దగ్గర ఆగిపోయి ఉంది. గోడమీద గడియారమూ అంతే టైము చూపిస్తోంది. ఆ విషాదంలోనూ గురుమూర్తి ఈ విషయం గురించి నాకు ఎందుకు చెప్పాలనుకున్నాడో అర్థం కాలేదు. నర్సు వచ్చి మమ్మల్ని వెళ్ళిపొమ్మంది. వెళ్ళిపోతూ, అతడివంక నవ్వుతూ చూసాను. రెండు వేళ్ళూ పైకెత్తి. నా వంక చూసి నవ్వాడు. మళ్ళీ నాలో ప్రశ్నార్థకం! ఆలోచిస్తూనే ఇంటికొచ్చేసాను. ఇంట్లో వ్రతం పూర్తి కావస్తోంది. పంతులుగారు వ్రతంకథ చెప్పడం ముగిస్తూ

"ఈ లోకంలో జరిగే విచిత్రం ఏమిటంటే పుట్టిన ప్రతి బిడ్డ, పుట్టగానే ఏడుస్తాడు, బిడ్డ పుట్టినందుకు ఆ బిడ్డ తల్లితండ్రులు, బంధువులు ఆనందపడతారు. కాలగతిలో ఆ బిడ్డ పెరిగిపెద్దవాడై మరణిస్తే, బిడ్డ పుట్టి నప్పుడు ఆనందించిన వారంతా ఏడుస్తారు. అయితే మరణశయ్య మీరు ఉన్నప్పుడు మాత్రం అందరూ ఏడుస్తున్నా, తను మాత్రం ఆనందంగా తనువు చాలించడమే జీవన సాఫల్యం" అన్నారు.

పంతులుగారి మాటలు నాకెందుకో హృదయాన్ని కదిలించాయి. ఆ మాటల్నే గుర్తు చేసుకుంటూ పూజ గదిలోంచి బైటకొచ్చాను. భోజనాలు

పూర్తయ్యే సరికి మూడయ్యింది. విస్తరిముందు కూర్చున్నా తినలేకపోయాను. గురుమూర్తి ముఖమే కనిపించింది. గబగబా భోజనం ముగించి నిద్రలోకి జారుకున్నాను.

* * *

నిద్రనుంచి లేచేసరికి సాయంత్రం అయింది. అప్పటికే బంధువులు మెల్లగా గృహోన్ముఖు లవుతున్నారు. అందరినీ సాగనంపేసరికి రాత్రి ఎనిమిది దాటింది. వాసును తీసుకుని అస్పత్రికి బయలుదేరాను. గురుమూర్తి భార్య, కొడుకు, బయట బెంచీమీద ఆందోళనంగా కనిపించారు. "ఏమ య్యింది?" అన్నాను. గురుమూర్తి మధ్యాహ్నం వరకు బాగానే ఉన్నాడుట.... ఆ తర్వాత కోమాలోకి వెళ్ళిపోయాడట. గోవిందు చెప్పిన మాటలతో మనసు మొద్దు బారినట్టయింది. "ఫరవాలేదు కంగారుపడకండి..." అంటూ అతడి భుజం తట్టాను. ఆ బెంచీమీద కూలబడి కళ్ళు మూసుకున్నాను. పాపం కొడుకు ప్రయోజకుడై అంది వచ్చాడనుకునేసరికి ఇలా అయింది! అనుకున్నాను.

అరగంటసేపు ఆలోచనలు నాలో ముసురుకకుంటూనే ఉన్నాయి. మరో పావుగంట తర్వాత ఆసుపత్రిలోంచి బయటకొచ్చిన డాక్టరు, గురుమూర్తి కొడుకు దగ్గరొచ్చి "సారీ..." అనడం వినిపించింది. పెద్దపెట్టున గురుమూర్తి భార్య, కొడుకు ఏడవడం ప్రారంభించారు. పావుగంటతర్వాత స్ట్రెచర్‌లో వుంచిన గురుమూర్తిని బయటకు తీసుకువచ్చారు. నా బాల్యమిత్రుడి నిర్జీవ శరీరాన్ని చూసిన నాకు ఏడుపు ఆగలేదు. అతడి కొడుకు చేతులు పట్టుకుని "కంగారుపడకు..... మేమంతా వున్నాం. మీ నాన్న ఏమన్నా మాట్లాడేడా.... నేను వెళ్ళిన తర్వాత...." అన్నాను.

"ఏదేదో మాట్లాడేడండి. ఒక్క వాక్యం పదే పదే చెప్పాడండి..." అన్నాడు.

"ఏమిటా వాక్యం.." అన్నాను ఆత్రుతగా.

"ఆగిపోయిన గడియారమైనా రెండుసార్లు కరక్టు టైము చూపిస్తూ

ఉంటుందటండీ!'' అదే పదే పదే చెప్పాడు అన్నాడు అతడి కొడుకు గోవిందు ఏడుస్తూ.

నేను ఆ అబ్బాయి మాటలకు గతుక్కుమన్నాను. గురుమూర్తి చేతి గడియారం వంక చూసి ఆశ్చర్యపోయాను. టైము రాత్రి తొమ్మిది దగ్గర వుంది. ఉదయం అతను నవ్వుతూ టైము చూడమన్నప్పుడు ఆ ఆగిపోయిన గడియారం తొమ్మిది దగ్గర వుంది. ఉదయం గురుమూర్తి నవ్వుతూ రెండు వేళ్ళు ఎందుకు చూపించాడో నాకు కొద్దిగా అర్థమవుతోంది. ఎందుకు పనికిరాడని 'ఆగిపోయిన గడియారంగా' పిలవబడిన గురుమూర్తి జీవితంలో రెండుసార్లు కరక్టుగా పనిచేసాడు.

ఒకసారి కొడుకు విషయంలో, తన బాధ్యత పూర్తి చేయడానికి ప్రమాద భరితమైన క్వారీలో వాచ్‌మేన్ ఉద్యోగానికి కుదురుకున్నాడు. రెండోసారి ప్రాణాలకు తెగించి యాభైమంది విద్యార్థుల ప్రాణాలు కాపాడాడు. అందుకేనా! అతను కొడుకుతో అలా చెప్పాడు. నా ఆలోచనలు సాగు తున్నాయి. గురుమూర్తి వంక చూసాను. ఉదయం అతన్ని కలిసినప్పుడు ఉల్లాసంగా కనిపించాడు. మరణభయం అతడి ముఖంలో లేదు. ఇప్పటికీ అదే ప్రశాంతత.

మధ్యాహ్నం వ్రతకథ ముగిస్తూ పంతులుగారు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. జీవితమంతా పనికిరానివాడుగా ముద్రపడినా, చివరికి జీవనసాఫల్యం సిద్ధించింది. అతడికి 'బహుశా గురుమూర్తి తన మరణ ఘడియల్ని ఆనందంగా అనుభవించి ఉంటాడు' అనుకున్నాను.

విగత జీవుడైనా, విజేతగా మిగిలిన నా బాల్యమిత్రుడికి రెండు చేతులూ జోడించాను.

(జాగృతి - వాకాటి పాండురంగారావు స్మారక కథా పురస్కారం) (జాగృతి 12-11-2012)